# చిన్న పిల్లల్లో షుగర్ వ్యాధి కారణాలు, నివారణోపాయాలు



చిల్డ్రన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్

2 లో... ▸




జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## ఖమ్మం

శనివారం | 30 | మే | 2026 ◆ పేజీలు : 5





# ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

- ఎస్.ఐ.ఆర్. కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలి
- ప్రతి ఇంటికి బీఎల్‌వో చేరుకొని పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలి
- డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి అభ్యంతరాలు,క్లెయిమ్‌లపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాలి
- రాజకీయ పార్టీలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలి
- ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై జిల్లా అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్

## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ద్వారా ప్రతి ఓటరు వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ, మ్యాపింగ్ ప్రక్రియ మరింత వేగవంతంగా చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అంశంపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి ఇప్పటివరకు చేపట్టిన మ్యాపింగ్ వివరాలను మండలాల వారీగా పరిశీలించి, పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో బీఎల్ఓల పని తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన ధృవీకరణ, సరైన డేటా నమోదు, పారదర్శకత తో పని చేయాలన్నారు. ఎస్ఐఆర్ లో భాగమైన మండలాలు, కార్పోరేషన్, మున్సిపాలిటీ సంబంధించి ప్రతి ఓటర్లను మ్యాపింగ్

మిగతా 2 లో... ▸

# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

## ఎమ్మెల్యే రాగమయి



మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**సత్తుపల్లి మే29(ప్రజా జ్యోతి)** మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని, కుటుంబానికి ఆర్థికంగా ఉండాలని సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పరిపాలనలో సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ,అభివృద్ధి చెందాలని ఉద్దేశంతోటి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, మున్సిపాలిటీలో మహిళ చైర్మన్, వైస్ చైర్మన్ మహిళా కౌన్సిలర్లు, ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో టీ క్యాంటీన్లు, అద్దె బస్సులు, అభివృద్ధి చెందేందుకు మధ్యాహ్న భోజనం ,స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాటు చేపించడం

మిగతా 2 లో... ▸

## రైతుకు మద్దతు ధర కాదు

# మోసపూరిత ధర

- రైతు రక్తంతో లాభాల పంట కోస్తున్న మధ్య వర్తులు
- రైతులను ఆగ్రహానికి గురి చేస్తున్న కోతలు
- రైతుల కష్టం మిల్లర్ల చేతిలో లాభాల పంట
- మిల్లర్ల దోపిడీకి అడ్డు కట్ట లేదా.?
- ఆవేదన చెందుతున్న రైతులు



**బోనకల్, మే 29 (ప్రజా జ్యోతి):** మండలంలోని ఐకెపి కేంద్రాల్లో కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని హన్మకొండలోని మిల్లులకు తరలిస్తే అక్కడ రైతులకు మరో భారీ దెబ్బ తగులుతోంది. మిల్లు యాజమాన్యం ఒక క్వింటాకు 10 కేజీల చొప్పున "తరుగు" పేరుతో కోత విధించడం రైతులను ఆగ్రహానికి గురిచేస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ₹2369 కాగా, తరుగు కోతలు, హమాలీ, రవాణా ఖర్చులు కలిపి ఒక్క క్వింటాపై

మిగతా 2 లో... ▸

# ఐకేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత... !

- గ్రామదీపికలను..ఏపీయం అసభ్యపదజాలంతో దూషించారని ఆరోపణ కార్యాలయం గేట్ వద్ద ధర్నాకు దిగిన గ్రామదీపికలు



**నేలకొండపల్లి, మే 29 ప్రజా జ్యోతి:** గ్రామదీపికల ను ఏపీఎం అసభ్య పదజాలంతో దూషించారని...మండల మధర్ థెరిస్సా (ఐకేపీ) కార్యాలయం వద్ద శుక్రవారం గ్రామదీపికలు ధర్నా నిర్వహించారు. ఆరుపులు, కేకలతో కార్యాలయం వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామదీపికలు నిరవదిక సమ్మె చేస్తున్న వారి గురించి స్థానిక ఐకేపీ ఏపీయం కె.సురేందర్ కార్యాలయంలో గ్రామదీపికల గురించి అసభ్యంగా మాట్లాడారని...గ్రామదీపికలకు సమాచారం అందింది. దీంతో వారంతా ఐకేపీ కార్యాలయం వద్ద ఏపీయం ను ప్రశ్నించారు. తాను ఎవరిని కించపరిచే

మిగతా 2 లో... ▸

## మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి




(మొదటి పేజీ తరువాయి...)

ధాన్యం కొనుగోలు కేంద్రాల అప్పగించడం,వంటి కార్యక్రమాలతో మహిళలను ఆర్థికంగా ఎదుగుదలకు చేయూత ఇస్తున్నారని అన్నారు. 23 వార్డులలో నిరుపేద మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహా, మున్సిపల్ చైర్ పర్సన్ రెహనా కమల్, వైస్ చైర్పర్సన్ బొంతు సుమలత, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కౌన్సిలర్లు మట్ట ప్రసాద్,నసీమా షరీఫ్, చల్లగుండ్ల నరసింహారావు,రామారావు,సూర్య, మహిళలు,కాంగ్రెస్ నాయకులు,అభిమానులు ఉన్నారు.

## ఐకేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత...!



(మొదటి పేజీ తరువాయి...)

విధంగా అనలేదన్నారు. దీంతో గ్రామదీపికలు నిలదీశారు. ఇరువర్గాల మధ్య 'తీవ్ర స్థాయిలో వివాదం జరుగుతుండగా......కార్యాలయం సిబ్బంది కిటికల నుంచి వీడియో లు తీయటం తో మరింత కోపోద్రిక్తులైయ్యారు. ఆరుపులు, కేకల మధ్య కార్యాలయం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కార్యాలయం ప్రధాన గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం కె. సురేందర్ మాట్లాడారు... తాను అలా అనలేదని...ఒకవేళ అన్నట్లుగా భావించి ఉంటే క్షమాపణ చెబుతున్నా అన్నారు. దీంతో ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా గ్రామదీపికల సంఘం జిల్లా నాయకురాలు రాజపుత్ర పార్వతీబాయి మాట్లాడారు...తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## రైతుకు మద్దతు ధర కాదు - మోసపూరిత ధర

(మొదటి పేజీ తరువాయి...)

సుమారు ₹400 వరకు రైతుపైనే భారం పడుతోంది. దీంతో రైతు చేతికి మిగిలేది కేవలం ₹1931 మాత్రమే. ఇదంతా సరిపోదన్నట్లు కొనుగోలు కేంద్రాల వద్ద రోజులు తరబడి లారీల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్యాకింగ్ ఖర్చులు, కూలీల వ్యయం, పెట్టుబడులు అన్నీ కలిపి చూసుకుంటే రైతు కష్టానికి గిట్టుబాటు పూర్తిగా కనుమరుగైపోతోంది. ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంట చివరకు మధ్యవర్తులు, మిల్లర్ల చేతుల్లోనే లాభాల పంటగా మారుతుండగా రైతు మాత్రం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం ఒక్కటే కాకుండా రైతు చేతికి ఆ ధర పూర్తిగా చేరేలా పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండటంతో మిల్లర్ల దోపిడీకి అడ్డుకట్ట లేకుండా పోతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతు కష్టానికి న్యాయం చేయాల్సిన వ్యవస్థే మౌనంగా ఉంటే ఇక రైతు బతుకుకు భరోసా ఎవరు అన్న ప్రశ్న మండల వ్యాప్తంగా వినిపిస్తోంది. ఇకనైనా అధికారులు స్పందించి రైతులకు తగు న్యాయం చేయాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.



# ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

(మొదటి పేజీ తరువాయి...)

చేసే విధంగా టార్గెట్ పెట్టుకొని వంద శాతానికి చేరుకోవాలన్నారు.ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియను జూన్ 24 నుంచి జులై 25 వరకు చేపట్టనున్నా రన్నారు.ఫారం-6, 7,8 ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలని, మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి,తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. బదిలీ ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను సక్రమంగా పరిశీలించి, రికార్డులను నవీకరించాలని తెలిపారు.ఓటర్లు అందరూ ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పాల్గొని సరైన వివరాలు అందించేలా తద్వారా ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు.బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే ఓటర్లు కూడా ఎలక్షన్ కమిషన్ ఆన్‌లైన్ సేవల ద్వారా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉందని వివరించారు. అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చి, అనర్హులైన ఓటర్ల వివరాలను తొలగించే ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.




ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు,మరణించిన ఓటర్ల వివరాల తొలగింపు,డబుల్ ఎంట్రీలతొలగింపు జరుగుతుందని తెలిపారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తి స్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి అర్హమైన ఓటరుని గుర్తించి జాబితాలో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.ఒక కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చూడాలని, 1200 మంది ఓటర్ల సంఖ్య దాటితే కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి బీఎల్‌వో వద్ద ఎన్యూమరేటర్ ఫారాలు తగినంతగా అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ప్రతి బీఎల్‌వోకు ఎస్ఐఆర్ నిబంధనలు,విధి విధానాలు,ఫీల్డ్ వెరిఫికేషన్ విధానం, ఫారాల నిర్వహణపై పూర్తి అవగాహన,పట్టు ఉండేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, కొత్త క్లెయిమ్‌లు, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాత్రమే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై ఫీల్డ్ స్థాయిలో విచారణ నిర్వహించాలని,ఎటువంటి ఫిర్యాదును నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ జరుగుతుందని,సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఎస్ఐఆర్ -2026 ప్రక్రియ నిర్వహణ, శిక్షణ, ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి, దిశానిర్దేశం చేశారు. జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు,సహాయక ఎన్నికల నమోదు అధికారులు, బిఎల్ఓలు,సూపర్‌వైజర్‌లతో సహా ఎన్నికల అధికారులకు శిక్షణా కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్పీసీ రాజేశ్వరీ,ఎలక్షన్ సూపరింటెండెంట్ రాజు,ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, అన్సరీ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చిన్న పిల్లల్లో షుగర్ వ్యాధి కారణాలు, నివారణోపాయాలు

### చిల్డ్రన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఇటీవలి కాలంలో పెద్దలకే కాకుండా చిన్న పిల్లల్లో కూడా షుగర్ (డయాబెటిస్) వ్యాధి బారిన పడే సంఖ్య ఆందోళనకరంగా పెరుగుతోందని ఖమ్మం చిల్డ్రన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత, ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల్లో వచ్చే ఈ మధుమేహం పట్ల తల్లిదండ్రులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే పిల్లల భవిష్యత్తును సురక్షితంగా ఉంచగలమని ఆయన పిలుపునిచ్చారు.పిల్లల్లో షుగర్ రావడానికి గల ముఖ్య కారణాలు,దాని లక్షణాలు,నివారణ మార్గాలను ఆయన ఈ క్రింది విధంగా వివరించారు.

**పిల్లల్లో షుగర్ రావడానికి ప్రధాన కారణాలు:**

**టైప్-1 డయాబెటిస్ (ఆటోఇమ్యూన్ సమస్య):** చిన్న పిల్లల్లో వచ్చే షుగర్‌లో అత్యధికంగా 'టైప్-1' రకానికి చెందినదే ఉంటుంది. శరీరంలో రోగనిరోధక వ్యవస్థ పొరపాటున ప్యాంక్రియాస్ (గ్రంథిలోని ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాలను నాశనం చేయడం వల్ల ఇది సంభవిస్తుంది.దీనికి జన్యుపరమైన లోపాలు లేదా కొన్ని రకాల వైరల్ ఇన్ఫెక్షన్లు కారణం కావచ్చు.

**టైప్-2 డయాబెటిస్ (జీవనశైలి మార్పులు):** పూర్వం ఇది కేవలం పెద్దలకే వచ్చేది, కానీ ప్రస్తుత రోజుల్లో పిల్లల్లో కూడా కనిపిస్తోంది. శారీరక శ్రమ లేకపోవడం, గంటల తరబడి టీవీలు, మొబైల్ ఫోన్లకు అతుక్కుపోవడం వల్ల ఈ సమస్య వస్తుంది.

**అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు:** జంక్ ఫుడ్,పిజ్జాలు,బర్గర్లు, బేకరీ ఐటమ్స్,కార్బోనేటెడ్ కూల్ డ్రింక్స్ ఎక్కువగా తీసుకోవడం వల్ల పిల్లల్లో ఊబకాయం (స్థూలకాయం) పెరిగి ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఏర్పడుతుంది.

**వంశపారంపర్యత:** తల్లిదండ్రులకు లేదా కుటుంబంలో ఇతరులకు టైప్-2 డయాబెటిస్ ఉన్నట్లయితే, పిల్లలకు కూడా ఈ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

**గుర్తించాల్సిన ముఖ్య లక్షణాలు:** పిల్లలు తరచుగా మూత్ర విసర్జన చేయడం (ముఖ్యంగా రాత్రి వేళల్లో పడక తడపడం). అతిగా దాహం వేయడం, ఎంత తిన్నా ఆకలి తగ్గకపోవడం.తగినంత ఆహారం తీసుకున్నప్పటికీ ఆకస్మికంగా బరువు తగ్గిపోవడం.పిల్లలు ఎప్పుడూ అలసటగా,నీరసంగా కనిపించడం మరియు చూపు మందగించడం,ఏదైనా గాయాలైనప్పుడు అవి త్వరగా మానకపోవడం.

**నివారణ,నియంత్రణ మార్గాలు:ఇన్సులిన్ థెరపీ (టైప్-1 కోసం):** టైప్-1 డయాబెటిస్ ఉన్న పిల్లల శరీరంలో ఇన్సులిన్ అస్సలు ఉత్పత్తి కాదు. కాబట్టి వైద్యుల సలహా మేరకు ప్రతిరోజూ ఇన్సులిన్ ఇంజెక్షన్లు లేదా ఇన్సులిన్ పంప్ ద్వారా ఇన్సులిన్ అందించడం తప్పనిసరి.

**ఆరోగ్యకరమైన సమతుల్య ఆహారం:** పిల్లల ఆహారంలో పీచుపదార్థాలు (ఫైబర్) ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఆకుకూరలు,తాజా కూరగాయలు, తృణధాన్యాలు,మొలకెత్తిన గింజలు అలవాటు చేయాలి.చక్కెర పదార్థాలు,మైదాతో చేసిన వస్తువులను పూర్తిగా దూరం పెట్టాలి.

**శారీరక శ్రమ మరియు ఆటలు:** పిల్లలను ప్రతిరోజూ కనీసం ఒక గంట పాటు అవుట్‌డోర్ ఆటలు (మైదానంలో ఆడే ఆటలు) ఆడేలా ప్రోత్సహించాలి. ఇది శరీరంలో ఇన్సులిన్ సామర్థ్యాన్ని పెంచుతుంది మరియు బరువును అదుపులో ఉంచుతుంది.స్క్రీన్ టైమ్ తగ్గించడం,మొబైల్,లాప్‌టాప్,టీవీ చూసే సమయాన్ని రోజుకు ఒక గంట లోపుకు పరిమితం చేయాలి.నిశ్చల జీవనశైలికి స్వస్తి పలకాలి.

**రెగ్యులర్ హెల్త్ చెకప్స్:** పైన పేర్కొన్న లక్షణాలు ఏవైనా కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే పిడియాట్రిషియన్‌ను సంప్రదించి రక్త పరీక్షలు చేయించాలి.డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ పిల్లల్లో డయాబెటిస్ అనేది కేవలం ఒక శారీరక రుగ్మత మాత్రమే కాదు, అది వారి మానసిక ఎదుగుదలను కూడా దెబ్బతీస్తుంది. టైప్-1 డయాబెటిస్‌ను పూర్తిగా నివారించలేకపోయినా, సరైన ఇన్సులిన్ వాడకం ద్వారా అదుపులో ఉంచవచ్చు.అలాగే టైప్-2 డయాబెటిస్‌ను క్రమశిక్షణతో కూడిన జీవనశైలి,పోషకాహారం ద్వారా 100% నివారించవచ్చు.తల్లిదండ్రుల పర్యవేక్షణ, అవగాహనే పిల్లల ఆరోగ్యానికి శ్రీరామరక్ష.అన్నారు.



# తరుగు పేరుతో భారీ కోతలు

- తరుగుతో రూ.25 వేల నష్టం
- క్వింటాకు 7.30 కేజీల తరుగు
- 126 క్వింటాలకు 9 కింటాల 42 కేజీల తరుగు
- అధికారులు స్పందించి న్యాయం చేయాలని రైతు ఆవేదన





**బోనకల్, మే 29(ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన రైతు రఘుపతి యాసంగి సీజన్‌లో 15 ఎకరాల్లో వరి సాగు చేసి 314 సంచులు 40 కేజీల ధాన్యం ఉత్పత్తి చేశారు. మొత్తం సుమారు 125 క్వింటాళ్ల పంట వచ్చినట్లు తెలిపారు. ఈ నెల 9వ తేదీన ధాన్యానికి కాంటా వేయగా, 19వ తేదీన లారీల ద్వారా తరలించారని చెప్పారు. కాంటా నుంచి రవాణా వరకు 10 రోజుల సమయం తీసుకున్నారని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం 28వ తేదీన క్వింటాకు 7.30 కేజీల తరుగు విధిస్తున్నట్లు ఐకేపీ సిబ్బంది తెలిపారని, ఈ ధాన్యాన్ని హనుమకొండలోని వీరభద్ర మిల్లుకు పంపించినట్లు వివరించారు. మొత్తం 126 క్వింటాళ్ల ధాన్యంలో 9 క్వింటాళ్లు 42 కేజీలు తరుగు పేరుతో తగ్గించడంతో సుమారు రూ.25 వేల వరకు నష్టం వాటిల్లిందని రైతు రఘుపతి వాపోయారు.ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2369 ఉన్నప్పటికీ, తరుగు పేరుతో భారీ కోతలు విధించడం వల్ల పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరారు.

## ఐదవ రోజుకు చేరిన వివోఏల సమ్మె

- సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం
- వివో ఏ మండల అధ్యక్షురాలు బోయినపల్లి దివ్య



**బోనకల్ ,మే 29(ప్రజా జ్యోతి ):** సమస్యల పరిష్కారానికై ఐకెపి వివోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం ఐదవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బోనకల్ మండల వివోఏ అధ్యక్షురాలు బోయినపల్లి దివ్య మాట్లాడుతూ... న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టినట్లు తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం అందుతున్న స్వల్ప వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, హెచ్‌ఆర్ పాలసీ వర్తింపు చేయాలని,అర్హులైన వివోఏ లకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని,సాధారణ , ఆరోగ్య భీమా సౌకర్యం రూ. 20 లక్షలు కల్పించాలని, 58వ జీవోను సవరించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మండల తహసిల్దార్ కార్యాలయం ముందు నిర్వహించిన సమ్మె కార్యక్రమంలో బోనకల్ మండలనికి చెందిన వివోఏలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బోనకల్ మండలం ఏపిఎం కొట్టే వెంకటేశ్వర్లు, సీసీ నాగమణి, శిరోమణి, వెంకట్ రావమ్మ, అకౌంటెంట్ రత్న కుమారి, కంప్యూటర్ ఆపరేటర్ రవి, హెచ్చిసి సీఈవో సాయి, వివోఏ మండల సంఘం మండల అధ్యక్షులు బోయినపల్లి దివ్య, ఉపాధ్యక్షులు మీరాబి , కార్యదర్శి దారెల్లి దివ్య , కోశాధికారి ఉష,సహాయ కార్యదర్శి ప్రమీల, వివోఏల సంఘం సభ్యులు సజ్జన, కృష్ణవేణి, శ్రావణి, శాంతి, రమాదేవి, వివో ఏ పైడిపల్లి కృష్ణ, వివో ఏ బలగాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షానికి కూలిన ఇల్లు

- సందర్శించిన అఖిలపక్ష నాయకులు
- బాధితుడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి
- అధికారులను కోరిన అఖిలపక్ష నాయకులు





**బోనకల్, మే 29(ప్రజా జ్యోతి ):** మండలంలో గత రాత్రి కురిసిన అకాల వర్షానికి మండల పరిధిలోని రావినూతల గ్రామంలో ఆవుల వీర మల్లయ్య ఇల్లు కూలింది. శుక్రవారం అఖిలపక్ష నాయకులు సందర్శించి కూలిన ఇంటిని పరిశీలించారు. బాధితుడు ఆవుల వీరమల్లయ్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అధికారులకు అఖిలపక్ష నాయకులు విన్నవించారు. వెంటనే కూ లిన ఇంటిని అధికారులు త్వరితగతిన పరిశీలించి బాధితుడు వీరమల్లయ్యకు న్యాయం చేయాలని అఖిలపక్ష నాయకులు అధికారులను కోరారు. సందర్శించిన వారిలో రావినూతల గ్రామ ఉప సర్పంచ్ దొండపాటి సత్యనారాయణ , మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ వట్టికుంట రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ గండు సైదులు, రావినూతల గ్రామపంచాయతీ వార్డు నెంబర్లు ఎరగాని నాగరాజు, గమ్మిడి శ్రీదేవి , పటాన్ అఫ్జల్, బానోతు కృష్ణ, అఖిలపక్ష నాయకులు డాక్టర్ గోపి, మంద వీరభద్రం, పుచ్చకాయల మోహన్ రావు, భూక్య లక్య, కందిమల్ల వెంకటేశ్వర్లు , జోయినబోయిన అంజి, గండు వెంకటి తదితరులు ఉన్నారు.

## సిపిఐ సీనియర్ నాయకుడు బోజడ్ల వెంకయ్య మృతి



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** ఖమ్మం రూరల్ మండలంలోని మంగళ గూడెం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకుడు బోజెడ్ల వెంకయ్య (95) అనారోగ్యంతో శుక్రవారం ఇంటి వద్ద మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా భౌతిక కాయాన్ని సందర్శించి ఎర్ర జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడికి ఒక కుమార్తె ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అజ్మీరా రామ్మూర్తి, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు పగిళ్ల వీరభద్రం, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మాజీ సర్పంచ్ బండి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలను కాదని సంపన్నులకు అప్పగిస్తారా

- ఎన్నెస్పి ఆక్రమణలను తొలగించకుంటే ఆందోళన
- గ్రీన్బెల్ట్ ఏర్పాటు ఏమైంది
- సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్
- ఆక్రమణలను పరిశీలించిన సిపిఐ బృందం



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** నిలువ నీడ లేక ఎన్నెస్పి కాలువ కట్టలపై గుడిసెలు వేసుకుంటే బలవంతంగా తొలగించిన రెవెన్యూ, పోలీస్ అధికారులు సంపన్నులు అక్రమిస్తే ఎందుకు నోరెత్తడం లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రశ్నించారు. పేదలకు ఒక రీతి,సంపన్నులకు మరో రీతిగా చట్టంలో రాసి ఉందా అని అలా ఉంటే అధికారులు వెంటనే స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మంలోని ఎన్నెస్పి స్థలాల ఆక్రమిత ప్రాంతాలలో –సిపిఐ బృందం పర్యటించింది. పేదల గుడిసెలను తొలగించి గ్రీన్బెల్ట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ప్రదేశాల్లో యధేచ్ఛగా నిర్మాణాలు జరుగుతుండటాన్ని పరిశీలించారు.అధికారులు,ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, రాజకీయ నాయకులే ఈ ఆక్రమణదారుల్లో ఉన్నారని సురేష్ తెలిపారు. పేదల గుడిసెలను తొలగించేందుకు –న్యాయస్థానాలను ఆశ్రయించి నిర్దాక్షణ్యంగా ఎన్నెస్పి కాలువ కట్టలపై పేదల గుడిసెలను తొలగింపజేసిన రాజకీయ –నాయకులే ఇప్పుడు స్థలాలను ఆక్రమించి షెడ్లు వేయడం శోచనీయమన్నారు. ఎన్నెస్పి మేజర్ 2లో 66 అడుగుల వెడల్పున నాగార్జున సాగర్ కాలువ ఉన్నట్లు అధికారులు ధృవీకరించారని 12వ డివిజన్లో అష్టలక్ష్మి దేవాలయం ముందు భాగంలో ఓ వ్యాపారితో మొదలైన ఆక్రమణ గొల్లగూడెం రోడ్డు వెంబడి యధేచ్ఛగా సాగుతుందన్నారు.ఇప్పటికే కొందరు తమ నిర్మాణాలను పూర్తి చేయగా మరి కొందరు గతంలో ప్రభుత్వం వేసిన ఫెన్సింగ్లను తొలగించి ఆక్రమణలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని సురేష్ తెలిపారు.కొందరు రాజకీయ నాయకులు ప్రోద్బలంతోనే ఇది జరుగుతుందని ఇందులో కొందరు కేవలం స్థలాల ఆక్రమణ కోసమే పార్టీలు మారారని సురేష్ –ఆరోపించారు. పేదల గుడిసెలను తొలగించి గ్రీన్బెల్ట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన అధికారులు గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేయకపోగా ఆక్రమణలను పట్టించుకోవడం లేదన్నారు. ఆక్రమణలను తొలగించకపోతే తిరిగి పేదల చేత ఈ స్థలాలను ఆక్రమించుకుని నివాసాలు ఏర్పాటు చేస్తామని సురేష్ హెచ్చరించారు. అధికార పార్టీకి చెందిన కొందరి ప్రోద్బలమే ఈ ఆక్రమణలకు కారణమని ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ విషయాన్ని గుర్తెరిగి తగు చర్యలు తీసుకోవాలని సురేష్ డిమాండ్ చేశారు. పరిశీలిన బృందంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు,జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ,సిపిఐ నాయకులు ఉపేందర్,నర్సింహారావు,సైదులు,మదూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పెరిగిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరల కు నిరసన

- ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు కొత్త సీతారాములు
- ముఖ్యఅతిథిగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు
- నూతి సత్యనారాయణ




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం నగరంలో ఐ ఎన్ టి యు సి ఖమ్మం జిల్లా అధ్యక్షులు కొత్త సీతారాములు ఆధ్వర్యంలో ఐ ఎన్ టి యు సి నగర అధ్యక్షులు నారాల నరేష్ మోహన్ నాయుడు అధ్యక్షతన పెరిగిన పెట్రోల్ ,డిజిల్ , గ్యాస్ ధరల కు నిరసనగా కార్యక్రమం ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ స్థానిక కాంగ్రెస్ ఆఫీస్ నుండి బాబు రావు పెట్రోల్ బంక్ మీదుగా భారీ ర్యాలీ గా బయలుదేరి మయూరి సెంటర్ కు చేరుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆటో ని పెట్రోల్ డీజిల్ రేట్లకు నిరసనగా తాళ్లతో లాగుతూ నిరసన తెలిపారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ గత 15 ఏండ్లలో ఎన్నోసార్లు పెట్రోల్ డీజిల్ రేట్లు పెంచి అంబానీ,అదానీలకు అనుగుణం గా పేద ప్రజల నడ్డివిరిచే ప్రయత్నం చేశారని మండిపడ్డారు వెంటనే కేంద్రం పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించి ప్రజలపై భారం తగ్గించాలని లేని పక్షాన నిరసనలను ఉదృతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్ , ఖమ్మం నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య , ఐ ఎన్ టి యు సి మోటార్ రంగ జిల్లా అధ్యక్షులు పాల్వంచ కృష్ణ ఆటో జిల్లా నగర సంఘాల అధ్యక్షులు వీరేందర్ రెడ్డి , తోట సైదులు ఐ ఎన్ టి యు సి నగర ఉపాధ్యక్షులు ఫజల్ సిద్దాల నగేష్ , సెక్రటరీ లు జనార్ధన చారి ,మెహరాజ్, బొడ్డు ఉపేందర్ , ఎఫ్ సి ఐ రవి నాయకులు ఓబీసీ సెల్ నగర అధ్యక్షులు బాణాల లక్ష్మణ్ ,జిల్లా ఐ ఎన్ టి యు సి సెక్రటరీ పోతగాని రమణ మహిళా కాంగ్రెస్ నాయకురాలు ప్రతిభ రెడ్డి ,సుగుణ , ఫరీద్ పాలకుర్తి నాగేశ్వరరావు ,జోగారావు ,ఉమారావు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ ప్రాథమిక విద్యకు ఆరు పాఠశాలలు ఎంపిక



**నేలకొండపల్లి, మే 29 ప్రజా జ్యోతి:**పూర్వ ప్రాథమిక విద్యకు మండలంలో ఆరు పాఠశాలలను ఎంపిక చేసినట్లు నేలకొండపల్లి మండల విద్యాశాధికారి బీ.చలపతిరావు పేర్కొన్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు... ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేసేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో పూర్వ ప్రాథమిక విద్య కోసం మండలంలో భైరవునిపల్లి, రాయగూడెం, చెరువుమాధారం, పైనంపల్లి, నాచేపల్లి, నేలకొండపల్లి ఎస్సీ, బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల లను ఎంపిక చేసినట్లు తెలిపారు. నాలుగేళ్ల చిన్నారుల కు ఫ్రీ ప్రైమరీ తరగతులు బోధించనున్నారు. నూతన విద్యా సంవత్సరంలో వాటిని ప్రారంభించే పాఠశాలలకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తారని పేర్కొన్నారు. ప్రతీ పాఠశాలకు ఒక పరిశీలకులు, ఒక ఆయా లను నియమించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాల లకు అవసరమైన ఫర్నీచర్,ఇండోర్, ఆవుట్డోర్, ఆట వస్తువులు ఆకట్టుకునే విధంగా గదులను రంగులతో తీర్చిదిద్దటం, ఆటా, పాటలతో బోధన కు అవసరమైన సామాగ్రిని కొనుగోలు చేసేందుకు నిధులు మంజూరు చేస్తారన్నారు. కావునా ప్రాథమిక విద్యను చిన్నారులు వినియోగించుకునేలా తల్లిదండ్రులు చూడాలని కోరారు.

## కల్లూరు లో 25 అడుగుల దివ్య కారుణ్య మూర్తి విగ్రహ ఆవిష్కరణ

- **బిషప్ సగిలి ప్రకాష్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభోత్సవం**






**కల్లూరు, మే 29 : ప్రజా జ్యోతి** పట్టణంలోని చిన్న తేరేజమ్మ దేవాలయం లిటిల్ ఫ్లవర్ చర్చ్ ఆవరణలో 25 అడుగుల కారుణ్య ఏసుక్రీస్తు స్వరూప విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. విచారణ గురువులు ఫాదర్ సురేష్ జోషి ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ పనులను ఖమ్మం పీఠాధిపతులు బిషప్ సగిలి ప్రకాష్ స్వయంగా ఆవిష్కరించారు. బిషప్ మాట్లాడుతూ చర్చి ఆవరణలో 25 అడుగుల దేవుని స్వరూపంతో పాటు క్రీస్తు శ్రమలను స్మరించుకునేందుకు 14 స్థలాలు యేసు 12 మంది శిష్యుల విగ్రహాలను కూడా నిర్మించినట్లు తెలిపారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం మందిరంలో ప్రత్యేక దివ్యబలి పూజా నిర్వహించి సుమారు 5000 మందికి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ మహా విగ్రహ నిర్మాణానికి గురువులు సురేష్, విజయ్, ఆనంద్, వినయ్ కుమార్ రెడ్డి, వైద్యులు దాసరి మాధవి, సివిల్ కాంట్రాక్టర్ ఉబ్బన ప్రభాకర్ జ్యోతి, పాటిబండ్ల మరియన్న, స్వరూప, నరేష్, మణి,మోహన్ రావు, ఉపదేశకులు, కన్యస్త్రీలు, సంఘం పెద్దలు, సంఘస్తులు యువతీ యువకులు అధిక సంఖ్యలో కతోలిక క్రైస్తవులు పాల్గొన్నారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి



**మధిర ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బతో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది.జిల్లాలోని మధిర మండలం మాటూరుపేట గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ కటారు పెద్దవెంకటేశ్వర్లు(58)ప్రతిరోజు లాగానే బుధవారం సుబాబుల పొలానికి కాపలాకి వెళ్లగా మధ్యాహ్నం వాంతులు కావడం, ఒళ్లంతా చెమటలు పట్టి అక్కడే కుప్పకూలిపోవడంతో సమాచారం తెలుసుకొని కుటుంబ సభ్యులు హుటాహుటిన మధిర ఓ ప్రవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు స్పృహ కోల్పోయి ఉన్నాడని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు.మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# మహ్మద్ జావేద్ సంస్మరణ సభను జయప్రదం చేయండి

- **జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్**



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ మహ్మద్ జావేద్ కాంగ్రెస్ పార్టీలో జిల్లా సేవాదళ్ అధ్యక్షులుగా, నగర కాంగ్రెస్ కమిటి మాజీ అధ్యక్షులుగా, పి సి సి మెంబర్ గా,రాష్ట్ర పంచాయతీ రాజ్ సంఘటన్ లో కీలక నేతగా కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు అందించిన వ్యక్తని, ఎత్తిన జెండా దించకుండా తన తుది శ్వాస వరకు పార్టీకి సేవలు అందించినారని, ఆయన మృతికి ముందు రోజు జిల్లాకాంగ్రెస్ , నగర కాంగ్రెస్ కమిటి కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చే సన్మానించబడ్డారని, ఆయన అకాల మరణానికి పార్టీ అధినాయకులు రాహుల్ గాంధీ,మల్లిఖార్జున ఖర్గే, ఏ ఐ సి సి కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తుమ్మల నాగేశ్వర రావు, కేంద్ర మాజీ మంత్రి ,రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి,పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి,శాసనసభ సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, మట్టా రాగమయి,కార్పొరేషన్ చైర్మన్ లు మరియు ముఖ్య నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసినారు,ఆయన అకాల మృతికి 31-05-2026న ఉదయం 11.00గంటలకు స్వగృహం రెడ్ హిల్స్ కాలనీ, వైఎస్ ఆర్ రోడ్ నందు స్వర్గీయ జావేద్ సంస్మరణ సభ ఏర్పాటు చేయనైనది.శ్రేణులు అందరు విచ్చేసి కార్యక్రమమును జయప్రదం చేయగలరు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,ఇంచార్జి మీనాక్షి నటరాజన్,జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తుమ్మల నాగేశ్వరరావు,పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, శాసన సభ సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, మట్టా రాగమయి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ లు హాజరవుతారు కావున శ్రేణులు అందరు గమనించి కార్యక్రమమును జయప్రదం చేయగలరు.

## పూడిక తొలగింపు పనులు ప్రారంభం



**మధిర, ప్రజా జ్యోతి** మధిర మున్సిపల్ చైర్పర్సన్ సామినేని సుజాత ఆదేశాలతో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని మెయిన్ డ్రైనేజీల పూడిక తొలగింపు పనులు వేగవంతంగా చేపట్టారు. ఇందుకోసం రాజమండ్రి నుండి ప్రత్యేక కార్మికులను తీసుకువచ్చి ఈరోజు 11వ వార్డులో డ్రైనేజీ శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని 11వ వార్డ్ కౌన్సిలర్ గద్దల మాధురితో కలిసి చైర్పర్సన్ పర్యవేక్షించారు. వర్షపు నీరు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా పట్టణంలోని ప్రధాన డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన పూడికను త్వరితగతిన తొలగించి శుభ్రపరచాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో 11వ వార్డ్ కౌన్సిలర్ గద్దల మాధురి, 12వ వార్డ్ కౌన్సిలర్ మోదుగు నాగలక్ష్మి , గద్దల నాని, మోదుగు బాబు, రాజా తదితరులు పాల్గొన్నారు.

## రెండు ద్విచక్ర వాహనాలు ఢీ ఇరువురికి స్వల్ప గాయాలు

- **తప్పిన ప్రమాదం**



**బోనకల్, మే 29 (ప్రజా జ్యోతి ):**రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇరువురికి స్వల్ప గాయాలైన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి 7.30 గంటల సమయంలో బోనకల్ గ్రామ పంచాయతీ సమీపంలో ఫ్లై ఓవర్ దిగువ భాగాన చోటు చేసుకుంది. అక్కడ ఉన్న స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు ద్విచక్ర వాహనాలు వైరా వైపు నుండి బోనకల్ ఫ్లై ఓవర్ మీదుగా వస్తుండగా ఎదురుగా ఫ్యామిలీతో వెళ్తున్న చింతకాని మండలం నాగులంచల గ్రామానికి చెందిన వారికి వెనక నుండి వస్తున్న ద్విచక్ర వాహన దారుడు వైరా మండలం గరికపాడు గ్రామానికి చెందిన కోలా రామకృష్ణ అతిగా మద్యం సేవించి ఎదురుగా ఫ్యామిలీతో వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టినట్లు స్థానికులు తెలిపారు. ముఖ్య విషయం ఏమిటంటే ఎదురుగా ఫ్యామిలీతో వెళుతున్న ద్విచక్ర వాహనంపై ఒక బాలుడు ఉండడంతో భారీ ప్రమాదం తప్పిందని స్థానికులు అన్నారు. ఢీకొన్న ద్విచక్ర వాహనదారుడు కోలా రామకృష్ణ ను స్థానికులు ఊరి పేరు అడగడంతో చెప్పలేని పరిస్థితుల్లో మద్యం సేవించి ఉన్నాడు. దీనితో అతనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తరువాత కూడా మద్యం సేవించి ఢీ కొట్టిన ద్విచక్ర వాహనదారుడినీ స్థానికులు మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయినా సరే తాగిన మత్తులో అతను సమాధానం చెప్పలేకపోవడం స్థానికులను ఆశ్చర్యం కలిగించింది.

## 11 వ రోజుకు చేరిన వివో ఏల సమ్మె



**కల్లూరు, మే 29 ప్రజా జ్యోతి** కల్లూరు మండలం పరిధిలోని గ్రామీణ ప్రాంతంలో పనిచేస్తున్న స్వయం సహాయక సంఘ సభ్యులకు విఓఏలు గత 22 సంవత్సరాలుగా పలు రకాల సేవలు అందిస్తూ వారు అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నారు .ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు నాగమణి నీలవేణి లు మాట్లాడుతూ మండల సమైక్య కార్యాలయం ముందు నేటికీ 11 రోజుల నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం నుంచి స్పందన లేదని ప్రభుత్వం స్పందించి వారి డిమాండ్లను ప్రస్తుతం 5000 గౌరవ వేతనంను ఇస్తూ వారిని వెట్టిచాకిరి కి గురి చేస్తున్నారని గౌరవ వేతనం కాదు కనీస వేతనం చట్టం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ పిఎఫ్, పెన్షన్ సౌకర్యం, ట్యాబ్ సౌకర్యం, సీనియర్ వివో ఏ లకు సిసిలుగా పదోన్నతి కల్పించాలని నిరవధిక సమ్మెతో నిరసన వ్యక్తం చేస్తున్నారు .ఈ కార్యక్రమంలో మణి, షహనాజ్, విజయలక్ష్మి , మాధవి ,కృష్ణవేణి ,లలిత, మల్లిక, దేవమణి, జ్యోతి, కళావతి ,అరుణ, కోటేశ్వరి, పద్మ, వెంకట రావమ్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మంచుకొండ సొసైటీ లో రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ



**రఘునాథపాలెం ప్రజా జ్యోతి** రఘునాథ పాలెం మండలం మంచుకొండ సొసైటీ పరిధిలో రైతులకు జీలుగ విత్తనాలు శుక్రవారం పంపిణీ చేసిన మండపు సుధాకర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కొందరు రైతులు అవగాహన లేకుండా పంట అవశేషాలు తగుల బెట్టడం వల్ల భూమి నిస్సారంగా మారడంతో పాటు వాయు కాలుష్యం పెరగడం పక్క పొలాలకు ఉద్యాన తోటలకు మంటలు అంటుకుని తోటి రైతులకు నష్టం చేస్తున్నారని అలా చేయకుండా భూమిలోనే దున్ని కార్బన్ శాతం పెరిగేలా చేస్తే రైతులకు ఉపయోగంతో పాటు పర్యావరణానికి మంచిదని తెలిపారు.రైతులు జీలుగ విత్తనాలు చల్లి భూమిలో కార్బన్ శాతం పెరిగేలా చేయాలని పశువుల పెంట చెరువు మట్టి తోలి పొలాలు మంచి పంటలు పండేలా మార్చాలన్నారు.విచ్చల విడిగా రసాయనాలు ఎరువులు వినియోగం వద్దని సేంద్రీయ విధానంలో సాగు చేయాలని రైతులను కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ కొంగర వెంకటేశ్వర రావు ఏవో ఉమా మహేశ్వర రెడ్డి సర్పంచ్ శంకర్ సీఈవో శ్రీనివాస రావు రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా మున్సిపాలిటీ వార్షికోత్సవ వేడుకలు

- రాష్ట్రంలోనే నెంబర్ వన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం చైర్మన్ ధారావత్





**కల్లూరు, మే 29 : ప్రజా జ్యోతి** కల్లూరు మున్సిపాలిటీ ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్, కమిషనర్, కౌన్సిలర్లు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధారావత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా మార్చడంలో కాంగ్రెస్ పార్టీ మంత్రివర్యులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి మరియు సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ కృషి ఎంతో ఉందని గుర్తు చేశారు. వారి సహాయ సహకారాలతో రాబోయే రోజుల్లో కల్లూరు మున్సిపాలిటీని రాష్ట్రంలోనే నెంబర్ వన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కోటేశ్వరి కృష్ణారెడ్డి, కమీషనర్ సిహెచ్ రాజశేఖర్, మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు దాసరి సుధారాణి, ఉబ్బన రాంబాబు నాగమణి శ్రీకాంత్, దార్ల లక్ష్మీనరసింహారావు, గుండ్ల పుల్లారావు, షేక్ ఇస్మాయిల్, పెదకంటి రామకృష్ణ, కృష్ణం శెట్టి లక్ష్మీ కొండల్, మండల నాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

## 12 వ రోజుకు చేరిన వివోఏల నిరసన దీక్షలు



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** న్యాయమైన కోరికల సాధన కోసం గత 12 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఐకెపి వీఓఏలు. ఎర్రుపాలెం కేంద్రంలోని వినూత్న నిరసన తెలిపారు. మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట వివోఏలు చేపట్టిన నిరసన దీక్షలు 12వ రోజుకు చేరుకున్నాయి. కనీస వేతనం రూ.20వేలు అమలు చేయాలని, 58 జీవో ను సవరించాలి,ఉద్యోగ భద్రత, హెచ్ఐర్ పాలసీ సౌకర్యం కల్పించాలని. డిమాండ్ చేస్తూ ఇంత ఎండలో ఉంటూ మా గోడును ఇకనైనా ప్రభుత్వం గుర్తించి పట్టించుకోవాలని.తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వీఓఏలు ప్రభుత్వాన్ని ఈ మేరకు కోరారు.ఈ కార్యక్రమంలో అధ్యక్ష ఉపాధ్యక్షులు కనకదుర్గ రాణి హేమలత జ్యోతి సరోజిని ఏడుకొండలు సుజాత పద్మ దుర్గా భవ్య నాగమణి జ్యోతి సైదమ్మ వెంకటేశ్వరమ్మ నాగమణి కమలమహాలక్ష్మి పద్మజ పద్మ స్వర్ణ లత సూర్యకళ స్వప్న జ్యోతి రమణ స్వాతి వినాయకుమారి వజ్రకుమారి వరలక్మీ త్రివేణి కనక దుర్గా కృష్ణవేణి కనక దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## వరదల నివారణ కు ముందస్తు చర్యల పై దృష్టి పెట్టండి

- పునరావాస కేంద్రాల ను గుర్తించి... సౌకర్యాల కల్పించండి



**నేలకొండపల్లి, మే 29 ప్రజా జ్యోతి:**వరదల నివారణ చర్యలకు సంబంధించి ముందస్తు చర్యలు తీసుకోవాలని నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం డిజిస్టార్ మేనేజ్మెంట్ సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ..గతంలో విపత్తులను ఎదుర్కొనేందుకు మండల యంత్రాంగం విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. రానున్న వర్షాలు, వరదల వలన ఏ ఒక్కరికి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు ' తీసుకోవాలని సూచించారు. పాలేరు ఏటి పరివాహక ప్రాంతం లోని గ్రామాల ప్రజలను వరదల పై అవగాహన కల్పించాలని కోరారు.మండలం లోని బోదులబండ, పైనంపల్లి, కట్టుకాసారం, చెరువుమాధారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాలనుఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రాలలో అన్ని సౌకర్యాలను కల్పించాలని సూచించారు. జూలై, ఆగస్టు లో పాలేరు ఏటి ప్రాంతాల లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వరదల నివారణ కోసం పని చేయాలని సూచించారు. శిధిలావస్థలో ఉన్న ఇళ్ల ను గుర్తించి...ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం ప్రతిపాధనలు పంపాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో యం. యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, మండల విద్యాశాఖాధికారి చలపతిరావు, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్, ఏఎస్సై కోటేశ్వరరావు, ఐకేపీ ఏపీయం సురేందర్, ఆయా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఏరియా పర్సనల్ మేనేజర్ గా బాధ్యతలు స్వీకరించిన తిరుపతి

- శుభాకాంక్షలు తెలియజేసిన ఐఎన్టీయూసీ నేత తీగల క్రాంతి కుమార్



**సత్తుపల్లి మే29(ప్రజా జ్యోతి)** సత్తుపల్లి ఏరియాలో జి.ఎం కార్యాలయంలో ఏరియా ఉద్యోగుల పలు సమస్యల పరిష్కారానికి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం సత్తుపల్లి ,కొత్తగూడెం ఏరియా పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఏరియా ఐఎన్టీయూసీ నేత తీగల క్రాంతికుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా,పూల బొకేతో సన్మానించారు.అనంతరం క్రాంతి కుమార్ మాట్లాడుతూ కార్మికులకు రావలసిన ప్రమోషన్స్ , ఇంక్రిమెంట్స్ సకాలంలో ఇచ్చే విధంగా చూడాలని కోరారు. కార్మికుల సంక్షేమం సమస్యల పరిష్కారం సంస్థ అభివృద్ధికి పరస్పర సహకారం అందే విధంగా చూడాలని , యాజమాన్యం మరియు కార్మికుల సత్సంబంధాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఏరియా పర్సనల్ మేనేజర్ తిరుపతి తమ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తారని కార్మికులకు న్యాయం చేసేలా సమస్యలను పరిష్కరించే విధంగా చూస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో ఎస్.ఓ.టు జి.ఎం బొల్లం శ్రీనివాస్,జే.వి.యర్ ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రహ్లాద్ , కిష్టారం ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ సునీల్ వర్మ , జే.వి.ఆర్ సి.హెచ్.పి డీ.జీ.ఎం సోమశేఖర్ ,సంక్షేమ అధికారి శ్రీనివాస్ ఇతర ఉన్నతాధికారులు ఐఎన్టీయూసీ ప్రతినిధులు పోగల నాగేశ్వరరావు, మోహన్,రషీద్,రాజేందర్, వెంకటేశ్వర్లు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కాలం వీరభద్ర రావు కుటుంబనికి పరామర్శ

- పిఆర్టియు నాయకులు



**మధిర ప్రజా జ్యోతి** రిటైర్డ్ ఉపాధ్యాయులు పెన్షనర్స్ సంఘం మాజీ బాధ్యులు కాలం వీరభద్ర రావు అనారోగ్య కారణంతో గురువారం మరణించడంతో వారి కుటుంబ సభ్యులనుపి ఆర్ టి యు జిల్లా మరియు మధిర మండల శాఖ బాధ్యులు పరామర్శించారు. కాలం వీరభద్ర రావు కి శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు మాట్లాడుతూ వీరభద్ర రావు మూడు దశాబ్దాల క్రితం ఉపాధ్యాయ వృత్తిలో రిటైర్డ్ అయినప్పటికీ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తన వంతు సహాయాన్ని అందజేసేవారని పేర్కొన్నారు మధిరలో పెన్షనర్స్ సంఘ స్థాపనలో క్రియాశీలక పాత్ర వహించి పెన్షనర్ సంఘం బాధ్యునిగా అనేక సంవత్సరాల పాటు పనిచేసి రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులు ఉద్యోగులకు ఎంతో సేవ చేసారనివారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు తమ సంఘం తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్ బ్రహ్మారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్ మధిర మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణ రెడ్డి పోలె సుధాకర్ మండల బాధ్యులు పిల్లి నరసింహారావు, సీనియర్ సభ్యులు రాజు తదితరులు పాల్గొన్నారు.

## కోదుమూరు -2 అంగన్వాడీ కేంద్రం నందు తల్లుల సమావేశం

- హాజరైన సీడీపీఓ సిహెచ్ . కమలప్రియ

**చింతకాని మే29ప్రజాజ్యోతి ప్రతినిధి :**ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక లో భాగంగా కోదుమూరు –2 అంగన్వాడీ కేంద్రం నందు తల్లుల సమావేశం నిర్వహించారు. సీడీపీఓ శ్రీమతి సిహెచ్ . కమలప్రియ హాజరై వారు మాట్లాడుతూ.మొదటి 1000 రోజుల పై అవగాహన,తల్లి పిల్లల పోషణ, పరిశుభ్రత,బాల్యారంభ అభివృద్ధి లో కుటుంబ సభ్యుల పాత్ర,అంగన్వాడీ కేంద్ర కార్యకలాపాలు గురించి వివరించారు.తల్లులు,పిల్లలకు పోషకాహారం పంపిణీ చేసి,గర్భిణీ గృహ సందర్శన చేశారు.ముఖ్య అతిధి గా ఉప సర్పంచ్ సిహెచ్ . రాంబాబు హాజరై వారు మాట్లాడుతూ.అంగన్వాడీ లో లభిస్తున్న పోషకాహారం,ప్రీస్కూల్ సేవలను వినియోగించుకోవలసిందిగా సూచించారు. హెల్త్ సూపర్వైజర్ శ్రీమతి రేచల్ రాణి ఇమ్యూనిసషన్,గర్భిణీ లకు అందించే ఆరోగ్య సేవలను గురించి వివరించారు.ఈ కార్యక్రమం లో ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీమతి టి.విజయలక్ష్మి,ఏఎన్ఎం పద్మావతి,అంగన్వాడీ టీచర్ గౌసియా బేగం,ఆశాలు,వరమ్మ , రేణుక,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వీవోఏల సమ్మెకు భారతీయ జనతా పార్టీ మద్దతు



**చింతకాని మే 29ప్రజాజ్యోతి :**చింతకాని మండల ఎంపీడీవో కార్యాలయం ఎదుట,తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వీవోఏల దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ వీవోఏ వర్కర్లు గత పది రోజుల నుండి చింతకాని ఎంపీడీవో ఆఫీస్ ఎదుట సమ్మె చేయడం జరుగుతుంది.వారి సమ్మెకు మదతుగా చింతకాని భారతీయ జనతా పార్టీ నాయకులు సమ్మెలో పాల్గొన్నారు.బిజెపి పార్టీ మండల అధ్యక్షులు కొండా గోపి మాట్లాడుతూ వీవోఏ ల డిమాండ్స్ మేరకు ప్రభుత్వం వెంటనే స్పందించి, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దీర్ఘకాలికంగా ఉన్న వాళ్ళ సమస్యకు పరిష్కారం చేయాలని, వీవోఏ లకు కనీస జీతం 20వేల రూపాయలు ఇవ్వాలని, అర్హులైన వివో ఏలకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని, సామాజిక ఆరోగ్య బీమా సౌకర్యం 20 లక్షలు వరకు కల్పించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, జీవో నెంబర్ 58వ సవరణ చేసి వారికి న్యాయం చేయాలని వారు మాట్లాడారు. సరైన న్యాయం జరగకపోతే వీవోఏ ల తరుపున రాబోయే రోజులలో కలెక్టరేట్ ముట్టడి చేయడానికి భారతీయ జనతా పార్టీ తరఫున మేము సిద్ధంగా సిద్ధంగా ఉన్నామని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోరిపల్లి శ్రీను,బుర్ర శ్రీను,ప్రధాన కార్యదర్శిలు గోద మంగయ్య,ఇమ్మడి సత్యనారాయణ,ఉపాధ్యక్షులు కొండా వెంకన్న,అంజన సిద్ధార్థ,వేముల ఎల్లయ్య,పామర్తి శ్రీను పాల్గొన్నారు.